# ఆగస్టు పదహైదు

ఎన్నాళ్ళగానో శిరిడీకి వెళ్ళిరావాలని మా ఆవిడ కోరిక. అది ఇప్పటికి నెరవేరింది.

రెండు రోజులు హాయిగా గడిపాం. పిల్లలతోపాటూ శిరిడీలో సాయిబాబా దర్శనం చేసుకున్నాం.

సాయంత్రానికల్లా శిరిడీకి దగ్గర్లోనే ఉన్న కోపర్‌గావ్‌లోని రైలు స్టేషన్ చేరుకున్నాం. అయిదు గంటలకి కర్నాటక ఎక్స్‌ప్రెస్ వచ్చింది. రెండవ తరగతి స్లీపర్ కోచ్‌లో ఉన్న మా నాలుగు బెర్తుల్నీ ఆక్రమించుకున్నాం. నాదీ, మా ఆవిడదీ ఎదురెదురుగా ఉన్న బెర్తులు, మాపైన ఉన్నవి మా అమ్మాయీ, అబ్బాయిలవి.

రైలు కదిలింది. వేగంగా ఒక్కోస్టేషనే దాటుకుంటూ దూసుకుపోతూ ఉన్నది. నలుగురం కింద బెర్తులలోనే కూచుని బయటి దృశ్యాల్ని చూస్తూ ఆనందిస్తున్నాం. మా నాలుగు బెర్తులపైన ఉన్న రెండు బెర్తుల్లో ఒకటి ఖాళీయే. మరొకదాంట్లో వున్న కన్నడ కుర్రాడు నా ప్రక్కనే కూచుని ఏదో కన్నడ పుస్తకం చదువుకుంటున్నాడు.

మాకు కొంచెం ఎడంగా వున్న కింది బెర్తులో చదువుకున్న దంపతులు కూచుని వున్నారు. వాళ్ళ తీరు చూస్తుంటే ఇద్దరూ ఉద్యోగుల్లానే ఉన్నారు. వాళ్ళ నుదుర్లకు ఉన్న విభూతి బొట్లు వాళ్లు అరవ వాళ్లనే విషయాన్ని చెప్పక చెబుతున్నాయి.

పొద్దు గుంకింది. చీకటి లోకాన్ని ఆవరిస్తూవుంది. మా పెట్టెలో అంతకుముందే వేసివున్న లైట్లు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

శిరిడీలోనే తెచ్చుకున్న పూరీ ప్యాకెట్లను బయటకు తీసింది మా ఆవిడ.

'వాటిని ఒక పట్టు పడదామా' అన్నాను పిల్లలవైపు చూస్తూ 'సరే'నంటూ నవ్వారు.

మమ్మల్ని చూసుకుని మా చుట్టుపక్కల వాళ్ళందరూ తిండికి ఉపక్రమించారు.

అందాకా నా పక్కనే ఉన్న ప్లాస్టిక్ సంచిలోంచి స్వీటు ప్యాకెట్టు తీసి గుల్కంద్ ముక్కల్ని పంచుతూ "ఈ పొద్దు ఆగస్టు పదహైదు. మన స్వాతంత్ర దినం గుర్తుందా - అందుకే ఈ స్వీట్లు" అన్నాను.

"అవునండీ! మర్చేపోయినా. ఇంట్లో అయితే ఏదైనా స్వీటు చేసేదాన్ని. జ్ఞాపకమే లేదు చూడబ్బా - ఈ టూర్‌లో పడి" అంది మా ఆవిడ నొచ్చుకుంటూ.

కన్నడ కుర్రాడికీ, అరవదంపతులకీ సందర్భం చెప్పి, స్వీట్లు ఇచ్చాను. సంతోషంతో తీసుకున్నారు వాళ్ళు.

అహమ్మద్‌నగర్ స్టేషన్‌లో ఆగింది రైలు. ఎవరో ప్లాట్‌ఫాం మీద నుంచే, మాపైన ఉన్న ఖాళీ బెర్తు విషయమై అడుగుతున్నారు. ఎక్కడినుంచీ వచ్చాడో టీ.సీ. 'అది ఖాళీగా లేదండీ, అంటూ హిందీలో చెబుతున్నాడు.

రాత్రి భోజనం కార్యక్రమం పూరీతో సరిపెట్టుకున్నాం.

మా నలుగురిలో ఎవరికీ జ్ఞాపకం వచ్చినా వాళ్ళు వెంటనే మా సామానులన్నీ చూడాలని రైలు ఎక్కకముందే మా ఆవిడ పాసుచేసిన ఆర్డరు. అందుకే మా అమ్మాయి లెక్కిస్తున్నట్టు సామానులన్నీ ఒకసారి కళ్ళతోనే చూస్తోంది.

"ఏమ్మా! అన్నీ సరిగ్గానే ఉన్నాయా" అడిగాను.

"ఊ... మూడు సూటుకేసులూ, రెండు వైరు బ్యాగులూ కద నాన్నా!" అంది, తనకూ అనుమానం వచ్చినట్టు మొహం పెట్టి

"మూడు సూట్‌కేసులెక్కడివీ! రెండే కద తల్లీ - మనవీ" అన్నాను నవ్వుతూ.

నా సీటు కిందనే గొలుసుతో లాక్‌చేసివున్న సూట్‌కేసుని చూపుతూ "దాన్ని మనదే ననుకున్నా" అంది - నవ్వుతూ.

"అదీ మనదాని లాగే వుంది కదా - ఇతనిదేమో" అన్నాను, నా పక్కన కుర్రాడిని చూపుతూ.

ఆ కుర్రాడు నా మాటల్ని గ్రహించినట్లు ఉన్నాడు. వెంటనే కన్నడంలో "ఇదా - ఇది నాది కాదండీ అద్గో జిప్‌బ్యాగ్ నా బెర్తులోనే వుంది. ఇది వాళ్ళదేమో" అన్నాడు - అరవదంపతులవైపు చూపిస్తూ, అంతవరకూ మమ్మల్నే చూస్తూ ఉన్న అరవదంపతులు తమను ఏదో అడిగేస్తున్నారని 'ఏం కావాలి' అన్నాడు భర్త. కనుబొమలు ఎగరేస్తూ, చెప్పాడు కన్నడ కుర్రాడు.

'అది మాది కాదండీ ఇద్దో ఇదే మాది' అన్నట్టు పక్కనే ఉంచుకున్న రెగ్జిన్ బ్యాగును చూపించాడు.

అక్కడ వున్న ఎవరిదీ కాని ఆ సూట్‌కేసు ఎవరిది?

ఇది మా అందరి తలలో పెద్ద ప్రశ్నార్థకమయిపోయింది.

రైలు మంచి వేగంతో వెళుతోంది.

కాసేపటికి కన్నడ కుర్రాడు బోగీనంతా కలయతిరిగి ప్రయాణికుల్నందరినీ విచారించుకొని వచ్చాడు - ఫలితం శూన్యమే. సూట్‌కేసు తాలూకు మనిషి ఎక్కడా లేదు

మరి అతను ఏమయ్యాడు?

ఏమయితే మనకేంలే అని వుండిపోవడమా? అట్లా వుండలేం కదా!

అరవాయన నావైపు చూస్తూ ఏదో మాట్లాడుతున్నాడు - అరవంలో ఆయన మాటల్లో బాంబు అన్న మాట తప్పా ఏమీ అర్థం కాలేదు.

"ఏమంటున్నాడతను?" అనడిగాను కన్నడ కుర్రాడిని. నాకు అంతో ఇంతో కన్నడం అర్థమౌతుంది. అందుకే అతన్ని అడిగాను.

"ఏమీ లేదు సార్! మన వెనకాల సీట్లో వున్న వాళ్ళు ఎవరో అంటున్నది చెబుతున్నాడు. ఈ సూట్‌కేసులో బాంబులు ఉన్నాయేమోనని అన్నారంట" అన్నాడా కుర్రాడు.

"బాంబా?"

మా ఆవిడ బాంబు తన ప్రక్కలోనే పద్దంతగా ఉలిక్కిపడింది.

"ఏమోనండీ! అందులో బాంబే ఉంటే ఎట్ల?" అంది మా ఆవిడ కంగారుగా వణుకుతున్న గొంతుతో.

వాళ్ళ అమ్మ తీరు చూసి బిక్కమొహాలు వేసుకు చూస్తున్నారు మా పిల్లలిద్దరూ.

ఇంక అరవాయన అదంతా గమనించి తనకు వచ్చీరాని తెలుగులో "ఎందుకు భయపడతావమ్మా! సూట్‌కేసులో బాంబు పెడితే ఎవరికేం లాభం" అన్న అర్థం స్ఫురించేలా మాట్లాడాడు.

అంతవరకూ ఉలుకూ పలుకూ లేకుండా బొమ్మలా కూచుని వున్న వాళ్ళావిడ ఆయనతో పోట్లాటకు దిగినట్టుగా తనూ వచ్చీరాని తెలుగులోనే - "లాభమంట లాభం - బాగా చెబుతావే టెర్రరిస్టులకి లాభాలతో ఏం పనీ... ఏందో తెలిసినోడి మాదిరిగా మాట్లాడ్తావుండాడు. మనదేశంలో ఎన్నిచోట్ల స్కూటర్లలోనా, కార్లలోనా టెర్రరిస్టులు బాంబులు పెట్టలేదు. బొంబాయి మాదిరి వున్న మహానగరంలో దార్లో దొరికిన ట్రాన్సిస్టర్లలో బాంబులు పేలాయనీ పోస్టులో వచ్చిన పార్సెళ్లు విప్పితే బాంబు పేలిందని పేపర్లో చదవలేదా మనం. అవన్నీ లాబాలు ఆశించేపెట్టినారా? ఎంతబాగా చెప్తారండీ... ఈ టెర్రరిస్టులకి ఏదో విధంగా సంచలనం సృష్టించి గవర్నమెంటుని బెంబేలెత్తించడమే పని... అదే వాళ్ళకి లాభం." అంది... ఆమె మాటల్లో తెలుగుదనమెంతో చూసేంత వాతావరణం లేదప్పుడు. మొత్తం మీద అంతా అర్థమయింది.

ఆ మాటలన్నీ విన్నాక మా ఆవిడ మరింత ఆందోళనకు గురి అయినట్టుంది. భయం ఆమె కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"ఏమండీ! చెయిన్ లాగేయండీ! ఇక్కడే దిగిపోదాము. దీన్లో బాంబు ఏ క్షణాన పేలుతుందో ఏమో" అంది.

"అదేమిటే అట్లంటావు! ఇంత రాత్రి ఈ చీకట్లో దిగి ఎక్కడికని పోతాము" అన్నా అంతకన్నా ఏమనాలో తెలీక.

మా ఆవిడ తీరును చూసి అరవామె మరీ రెచ్చిపోయి "ఈరోజు ఆగస్టు పదహైదు. ఇది కూడా మనం గుర్తుంచుకోవాలి. ఈరోజు దేశంలో చాలాచోట్ల విధ్వంసకాండ జరపాలని టెర్రరిస్టులు పథకాలు వేసుకొని ఉన్నట్లు పేపర్లోకూడా వచ్చిందండీ, మీ తెలుగు పేపర్లో రాయలేదా? మా తమిళ పేపర్లో ఎంత బాగా రాసినారో! ఈ సూటుకేసు బాంబుకూడా టెర్రరిస్టులపనే అయివుంటుంది" అన్నది.

ఈ అరవావిడకి తెలుగు ఎందుకన్నా అర్థాబర్థం వచ్చిందా - బొత్తిగా రాకపోతే ఎంత బాగుండు అనిపించింది ఆ క్షణంలో.

నిమిషాలమీద సూటుకేసు బాంబు విషయం రైలు పెట్టె అంతా పాకిపోయింది. అంతే – క్షణాల్లో రైలుపెట్టె రైల్వే ప్లాట్‌ఫాంలా మారిపోయింది. ఒక్కొక్కరు రావడం, నా కాళ్ళ కింద సూటుకేసును అప్పుడే పేలేందుకు సిద్ధమయిన బాంబును చూసినట్లు చూడడం, పోతూ పోతూ పాపం మరికాసేపట్లో నామరూపాల్లేకుండా పోతారు అన్నట్లు మావైపు చూడటం.

వాళ్ళ చూపులు నాకు కంపరాన్ని పుట్టిస్తున్నాయి. ఇంతపెద్ద బాంబు నిజంగా పేలితే! మేమే కాదు ఈ పెట్టెలో ఎవరూ మిగలరు! అన్నాను. ఆ వచ్చిన వాళ్ళని ఉద్దేశించి.

"కరెక్టు మీరన్నది... అసలు ఈ పెట్టె ఒకటేమిటి, అయిదారు పెట్టెలు గల్లంతయిపోవూ... అందులోనూ ఇపుడు తీవ్రవాదులు అల్లాటప్పాబాంబులు పెట్టడంలేదు. ఆర్‌టిఎక్స్ లాంటి శక్తివంతమైన పదార్థాన్ని ఉపయోగిస్తున్నారు" అన్నాడు మా వెనకాల బెర్తులోని ప్రయాణికుడు మావైపు తొంగిచూస్తూ.

ఈ ప్రహసనం చూస్తున్న కొద్దీ నాకు వెర్రెత్తినట్టు అనిపిస్తోంది. అరె అందులో బాంబు వుందో లేదో తెలీదు. అందర్లోనూ భయాందోళనలు. ఇంక మా ఆవిడ సరేసరి. అందర్నీ చెడామడా తిట్టేయాలనిపిస్తోంది. అట్లాగని భయపడవద్దని హామీ ఇచ్చేంత సాహసం చేయలేను. దేశంలో టెర్రరిస్టుల చర్యలు అట్లావున్నాయి మరి! అందులోనూ ఈరోజు ఆగస్టు పదహైదు. ఆ అరవావిడ చెప్పింది నిజమవుతుందా? ఏమో కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. అందరితోపాటూ నేనూ కీడెంచడం మేలేమో!

"వచ్చే స్టేషనులోని రైల్వే పోలీసులకి ఈ సూటుకేసు విషయం వాకీ టాకీ ద్వారా తెలిపారట టీసీ వాళ్ళు దీన్ని తీసికెళతారట" అని అరవాయన తెలుగును హింసధ్వనిలో పలికిస్తూ చెప్పాడు నాతో.

"వచ్చే స్టేషనా... అదెంత దూరం వుంది? ఇంకెంతసేపట్లో రావచ్చు? ఈలోగా అది పేలితేనో" అంది మాఆవిడ, నాచెవికి మాత్రమే వినిపించేలా.

"పేలితే ఏమవుతుంది అందరం ఒకసారి పోతాం" అన్నా జోక్‌గా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తూ.

"మీకన్నీ జోకులే... ఎంతసేపట్లో ఆ స్టేషను వస్తుంది?" అంది మొహం సీరియస్‌గా పెట్టి.

"ఏమో... బహుశా ఒక అర్ధగంట పట్టవచ్చు" అన్నాను.

"కొంతసేపు ఆలోచించి ఇప్పుడు టైమ్ పదకొండువ్వర... అరగంట తర్వాత ఆగస్టు పదహైదు దాటిపోతుంది. ఆలోగా పేలాలని పెట్టారేమో" అని కొత్తపాయింటు తీసింది మా ఆవిడ.

"అవును ఆలోగానే పేలితేనే కదూ టెర్రరిస్టుల పని పూర్తిగా నెరవేరేదీ..." అన్నాను – ఆవిడ మాటలకి తాళం వేస్తున్నట్టు.

"మీరు నా మీద జోకుల బాంబులేం వెయ్యొద్దుకానీ, ఈ పసిపిల్లల్ని చూడండీ... ఎంత అమాయకంగా ఉన్నారో. అభం తెలీదూ, శుభం తెలీదూ. వీళ్ళకి ఎంత జీవితముంది. వీళ్ళు పెరగల్ల, చదవల్ల, ఉద్యోగాలు చెయ్యల్ల. పెండ్లిల్లు చేసుకోవల్ల. పిల్లల్ని కనల్ల"

అంటూ సీరియల్‌గా చెప్పుకుపోతోంది - కన్నతల్లి మరి పిల్లల విషయంలో ఆ మాత్రం దిగులుపడ్డం మామూలే.

రైలు వేగంగా పోతోంది.

ఎవరితోనూ నాకు మాట్లాడాలనిపించడంలేదు. మౌనంగా కళ్ళు మూసుకున్నాను. రెండు నిమిషాలకోమారు కునుకు పట్టినట్టు అనిపిస్తోంది. అంతలోనే మెళకువ... మళ్ళీ కునుకు... మళ్ళీ మెళుకువ - అప్పుడే కునుకు.

"ఏమిటీ? మీరట్లాకునుకు తీస్తుంటే నేనీ టెన్షన్ భరిస్తూ వుండల్లా? ఇంక నేను నా పిల్లల్నయినా బతికించుకుంటాను గొలుసు ఇగ్గేస్తాను" అంటోంది మా ఆవిడ. అట్లా అనడమే ఆలస్యమైనట్టు గొలుసు లాగేసింది. స్పీడుగా వెళుతున్న రైలు పెద్ద శబ్దం చేస్తూ ఆగిపోయింది. బరబరా పిల్లలిద్దర్నీ లాకెళ్తూ రైలు దిగేసింది. నేనొక్కణ్ణి పెట్టేబేడ పట్టుకొని ఆమెను అనుసరించాను. ప్రయాణికులందరూ విచిత్రంగా చూస్తున్నారు. చీకట్లో నిలుచున్న మమ్మల్ని... రైలు మెల్లగా కదిలిపోతోంది.

"ఢా"మ్మంటూ దిక్కులు పిక్కటిల్లే శబ్దంతో మేము అందాకా ప్రయాణం చేస్తున్న పెట్టె పేలిపోయింది. దాని తాలూకు శకలాలు నిప్పులు విరజిమ్ముతూ మావైపు వస్తున్నాయి. "పారిపోదాం పదండి" అంటూ గట్టిగా అరుస్తున్నా...

అంతలోనే మెలుకవ వచ్చేసింది. వెంటనే ఆ సూటుకేసును చూశాను. నవ్వొచ్చింది, నాకు ఇలాంటి కల వచ్చిందంటే - అందరికంటే నేనే ఎక్కువగా బాంబు గురించి భయపడుతున్నానా? ఏమో.

టాయిలెట్‌కు వెళ్ళొచ్చాను. మా భోగీలో ఎవ్వరూ నిద్రపోలేదు. అంతా సూటుకేసు బాంబుగురించే ఆందోళన చెందుతున్నారు.

నిజమే, అందరిలోనూ ఆందోళన పడదగ్గ వాతావరణం ఇవాళ దేశమంతటా ఆవరించి ఉంది. మొన్నటికి మొన్న ఢిల్లీలో టీచర్లకి ఏదో ప్రత్యేక శిక్షణ ఉందంటే ఎంతో ఉత్సాహంగా వెళ్ళాడు, మా కొలీగ్ కొడుకు. ఒకరోజు ఉదయం సిటీబస్ ఎక్కాడు, - అంతే బాంబు పేలింది. చాలామంది చనిపోయారు. అ కుర్రాడు అదృష్టవంతుడు కాబట్టి కాలు మాత్రమే పోగొట్టుకున్నాడు. దేశ రాజధానిలో పట్టపగలు బాంబులు పేలిపోతుంటే ఇట్లాంటిచోట్ల ఏం జరిగితే ఏం దిక్కు.

ఇంతలో టీసీ చెప్పిన స్టేషను వచ్చేసింది. రైల్వే పోలీసులు ఐదుగురు వచ్చి, సుత్తీ ఉలులతో సూట్‌కేసుకున్న గొలుసుబంధాన్ని తెగ్గొట్టి తీసుకుపోయారు. అంతటితో మా గుండెలమీద బరువు దిగిపోయినట్టయింది. మృత్యుముఖంలోంచి తప్పించుకున్న ఫీలింగు అందర్లో.

'దేవుడున్నాడండీ' అంటూ మా ఆవిడ పిల్లలవైపు ఆనందంగా చూస్తోంది.

రైలు మళ్ళీ కదిలింది. వేగం పుంజుకుంది.

అందరూ నిశ్చింతగా నిద్రకు ఉపక్రమించారు.

టీ, కాఫీ, టిఫెన్లు అమ్ముతున్న గోల వినిపించే సరికి లేచి చూశాను. కిటికీలోంచి 'గుంతకల్లు జంక్షను' బోర్డు కనిపిస్తోంది. చేతికున్న వాచీ చూసుకున్నాను. ఏడు గంటలయ్యింది. మా ఆవిడ అప్పటికే లేచి వుంది. 'నీళ్ళు తెచ్చియ్యండి' - సీసా అందిస్తూ.

సీసాలో నీళ్ళు తీసుకొచ్చేటప్పటికి నా సీటు దగ్గర సన్నగా, ఎర్రగా వున్న పాతికేళ్ల కుర్రాడు నించుని ఉన్నాడు. 'ఏం కావాలి' అడుగుదామనుకునేంతలో, మా ఆవిడ నాతో – "ఈ పిల్లోనిదేనంట ఆ సూటుకేసు."

"ఎక్కడికెళ్ళావురా రాత్రంతా" అన్నాను. ఆ కుర్రాడు బిత్తరపోయి చూశాడు. వెంటనే మా ఆవిడ కలుగజేసుకొని 'అయ్యో ఆ పిల్లోనికి తెలుగు రాదండీ – హిందీ పిల్లోడు' అంది.

వచ్చీరాని హిందీలోనే అడిగాను.

ఆ కుర్రాడు చెప్పడం మొదలుపెట్టాడు హిందీలో – "నేనూ, మా ఫ్రెండూ ఢిల్లీనుంచి బెంగుళూరుకు ఉద్యోగానికి ఇంటర్వ్యూకిగానూ పోతున్నాం. నాకు ఎస్1లోనూ, మా వాడికి ఎస్6లోనూ రిజర్వేషన్ దొరికింది. కాసేపు వాడితో మాట్లాడివద్దామనుకొని వెళ్ళాను. చైన్‌తో సూట్‌కేసును లాక్‌చేశాను కదా, అందులోనూ సూట్‌కేసులో విలువయిన వస్తువులు ఏమీ లేవుకదా ఉత్తసర్టిఫికెట్లు, ఒక జత బట్టలూ, ఎవరయినా ఏం చేసుకుంటారని, నేను రాత్రంతా నా ఫ్రెండ్‌తో మాట్లాడుతూ ఉండిపోయాను" అన్నాడు.

చావు కబురును ఆ కుర్రాడికి చల్లగా చెప్పేశారు అంతా – సిగ్గుపడుతూ నీరసంగా కూలబడ్డాడు – ఆ కుర్రాడు.

• అనంత రెవెన్యూ సావనీరు – మార్చి, **2008** •